# వాయిదా విలాపం

## పి. శ్రీనివాస శాస్త్రి

ఒక్క మాటలో చెప్పాలంటే అహోబల రావుది వాయిదాల జీవితం.

దేశ పరిస్థితులు బాగుపడిన తరవాత గానీ పెళ్ళి చేసుకోను అంటూ నూనూగు మీసాల వయసులో ప్రతినపట్టి ఎప్పటి కప్పుడు పెళ్ళిఊసు వాయిదా వేసుకొంటూ వచ్చాడు. ఫలితంగా జుట్టు నెరిసి, ముఖం వడలి, కాళ్ళలో సత్తువ తగ్గిన వయసులో కూడా బ్రహ్మచారిగా మిగిలిపోయాడు. "పెళ్ళికి దేశ పరిస్థితికీ లంకె పెట్టుకుంటే దేశంతో బాటు నువ్వూ పాడయిపోతా వారే" అని మిత్రులు చేసిన హెచ్చరిక తలకెక్కి నలభయ్యో ఏట పెళ్ళి పీట ఎక్కాడు. ఆ పెళ్ళిపీటకి ఓకాలు లేదు. తాళి కట్టిన భార్యకి తన మీద ప్రేమ లేదు. అందుచేత పిల్లల్ని కనడం వాయిదా వేసుకున్నాడు. సంసారం సరంజామా "వాయిదాల" మీద కొన్నాడు. యాభయ్యో ఏట ప్రథమ సంతానం. సుభద్రని కన్నప్పటికి ఇంట్లో ఫాన్, టేబుల్, కుర్చీలూ, మంచాలూ ఏదీ ఇన్‌స్టాల్‌మెంట్లు పూర్తిగా కట్టకపోవడంవల్ల అతని సొంతం కాదు. సుభద్రని ఆపరేషన్ చేసి బైటకు తీసిన డాక్టరు మూడొందలు బిల్లుచెప్పాడు మూడు వాయిదాల్లో తీరుస్తానన్నాడు అహోబలరావు. "మీకిచ్చే బోనస్‌లోంచి మూడొందలూ డాక్టరికి ఫీజు కట్టెయ్యండి. కనీసం ఈ పాపన్నా పూర్తిగా మన సొంతం అవుతుంది" అంది భార్య. బోనస్ అను వాయిదా వేతనాన్ని ఆఫీసు యజమానులు వెంటనే చెల్లించక వాయిదా వేశారు. దాంతో పుట్టిన మూడు నెలల తరువాతగానీ సుభద్ర సొంత బిడ్డ కాలేక పోయింది అహోబలరావుకి

ఈ కథ ప్రారంభమైన రోజున—అంటే ఫస్టు నెలాఖర్లో అర్జంటుగా 3 వందలకి అవసరం వచ్చింది కాని, ఆ అవసరం తీరే అవకాశం రాలేదు.

అందుచేత దిక్కుతోచక గుండెలు గొక్కుంటూ కరువు తీరా ఏడుద్దామను కున్నాడు అహోబలరావు. ఆ ఆలోచన కలిగిన ఉత్తర క్షణంలో చుట్టూ కలయ చూశాడు.

తానున్నది ఆఫీసులో.

తన చుట్టూ ఉన్నది సహాచరులు.

ఇంత మంది మధ్య, హఠాత్తుగా ఏడుపు లంకించు కుంటే పరువేం కాను?

అందుచేత అహోబలరావు ఏడుపుని తాత్కాలికంగా వాయిదా వేసుకొన్నాడు.

"మరి పది నిముషాలు పోతే గడియారం గంట కొట్టేస్తుంది. (ఏ గడియారమూ కాలాన్ని వాయిదా వేయదు కదా!) బైటికి పోయి మరో ఐదునిముషాలు నడిస్తే పార్కొచ్చేస్తుంది, అందులో కూచుని కరువు తీరా ఏడ్చెయ్యొచ్చు."

అహోబలరావు ఈ నిర్ణయాని కొచ్చే సరికి గడియారం గంట కొట్టే ముందు ఆఫీసరు గార్నుంచి పిలుపొచ్చింది.

"ఏరోజు ఫైళ్లు ఆరోజు పూర్తి చేయటం లేదు నువ్వు. పని వాయిదా వేస్తే ఊరు



కోసు" అనే సారాంశంగల ఉపన్యాసం అనంతరం ముఖ కవళికలో కారం తీరు మార్చుకని అహోబలరావు సతమత మవుతున్న సమస్యల మీదకి ఓ క్వశ్చన్ మార్కు తోశాడు ఆఫీసు రాక్షసుడు.

ఆయనకి అర్జంటాతి అర్జంటుగా ఇప్పుడు గుంటూరు మిరపకాయలు కావాలి! పది కేజీలు పట్రమ్మని పురమాయించారు సగం డబ్బే యిస్తూ—"వెధవది పైసలు ఆడ్డం లేదోయ్ అహోబలరావూ!"

తిమిర ఇనుమున తైలంబు తీసినట్టుగా తిరిగి తిరిగి పాతిక రూపాయల అప్పు పుట్టించి ఆఫీసరారాధ్యుడై వానికి గుంటూరు మిరప కాయల నైవేద్యం

సమర్పించుకున్నాడు అహోబలరావు. ఆ తంతంగం అయిన తరవాత ఏడుద్దామన్న అహోబలరావు కోరిక రెట్టింపయ్యింది గాని పార్కు మూసేశారు. "ఇంటి కెళ్ళి ఏడుద్దాంలే" అనుకున్నాడు అహోబలరావు మళ్ళా.

డబ్బుల్లేవు అనుకోకుండా పౌరుషానికి "వెధవ సిటీ బస్సు కోసం ఎదురు చూడొద్దు" అనుకొని వీరోచితంగా ఇంటి వైపు నడక సాగించాడు. మధ్యలో కాళ్లు పీకినట్లయి హఠాత్తుగా తానిందాకా ఏడుపు వాయిదా వేసుకొన్న సంగతి గుర్తొచ్చింది అహోబలరావుకి.

అనూ, పానూ, వీలూ సాలూ సమయం సందర్భం ఇత్యాదులు కలిసాయో లేదోనని మళ్ళా చుట్టూ పరికించి చూసాడు.

ఇంకా నయం. రోడ్డు గొప్పింటి పెళ్ళంత సందడిగా వుంది. అంత మంది మధ్యన ఏడుపు ప్రారంభించకుండా మరో సారి పరువు కాపాడుకొన్నందుకు తనను తాను మెచ్చుకున్నాడు. కానీ అంతలోనే ఒక సీసం పెంకు ఆకులాఅరిగిన చెప్పు కిందనించి కాలిలో కస్సున గుచ్చుకుంది. దబ్బున చతికిల పడ్డాడు. ఇక లాభంలేదు - ఏడ్చేద్దాం అనుకొంటుండగా కిలకిలలాడుతూ పిల్లలు చుట్టుముట్టారు. వాళ్ళెవరికీ సరిగా ఒట్టల్లేవు వాళ్ళవాళ్ళ తల్లిదండ్రుల సంసారాలు కూడా సరిగా సాగుతున్న దాఖలాల్లేవు. అయినా వాళ్ళు ఏడవటం లేదు. పైగా అహోబలరావు సీసం పెంకు గుచ్చుకొన్నందుకు ఏడిస్తే వెంటనే నవ్వుతూ చుట్టూ గంతులెయ్యడానికి రెడీగా వున్నారు. మిణుకు మిణుకు చూస్తూ"

"బ్రేవో మైడియర్ అహోబలం" అనుకున్నాడు అహోబలరావు. మళ్ళా ఏడుపు రాత్రికి వాయిదా వేసుకున్నాడు. అలా రోడ్డుమీద చతికిల పడే సీసంపెంకని జాగ్రత్తగా కాల్లోంచి లాగి తెగిన చెప్పుతో దాన్ని కసికసిగా చావ గొట్టేసరికి సీసం పెంకకి ఏమీ కాకపోగా చెప్పు తెగింది.

అహోబలరావు అంత విపత్తులోనూ ఏడవనందుకు చుట్టూ మూగిన పిల్లలు ఓ ఆటకి అవకాశం జారిపోయినట్లు చిన్న బుచ్చుకున్నారు. తెగిన చెప్పు విసిరేసి అహోబలరావు రోడ్డుచ్చుకున్నాడు.

ఆసుపత్రులు ... మందులు ... ఫీజులు ... ఉద్యోగాలు... లంచాలు ... రోడ్డుమీద సీసం పెంకులు ...బాగుపడని దేశపరిస్థితి...తెగిన తీగ కాని చెప్పు...

ఏడ్చెయ్యాలి.... ఏడ్చెయ్యాలి..., అనుకుంటూనే రెండో చెప్పును పారేద్దామా ఒంటిచెప్పుతో కుంటు కుంటూ నడుద్దామా అని ఆలోచించి ఆ రెండు చెయ్యడానికి మధ్య తరగతి మనసు వెంటనే ఇష్టపడక పోవడంతో కొంత దూరం కుంటుకుంటూ నడిచి ఆ తరవాత చెప్పు విసిరేశాడు.

ఆ ఒంటరి రోడ్డు మీద ఓ వీధి లైటుంది గానీ అది వెలగదు. ఆ రోడ్డులో దొంగలుంటారు తప్ప మనుషులుండరన్న నమ్మకంతో రాత్రిళ్ళు ఎవరూ అటు రారు. వచ్చినా అక్కడ ఉండకుండా జ్వాలా తోరణం నాడు నిప్పుల మీద నడిచే వాళ్ళలా నడుస్తారు — అనగా — పరిగెడతారు.

అక్కడికి రాగనే అహోబలరావుకి ఇందాకటినించీ వాయిదా వేసుకొంటూ వచ్చిన ఏడుపు ప్రెషరెక్కువైన పంపు నీళ్ళలా తన్నుకురాబోయింది.

వీధి లాంతరు కింద చెంగిలబడి ముందు మంద్ర స్థాయిలో ఆలాపన చేసుకున్నాడు.

పోలీసులకు శాస్త్రీయ సంగీత జ్ఞానం ఉండదేమోగాని అక్కడ ఆ చీకట్లో బీటు కానిస్టేబుల్ మాత్రం, "వెలగని వీధి లాంతరు కింద ఈ కచేరి ఏమిటి?" అన్నట్లు చూసాడు అహోబలరావుని.

అహోబలరావు సంగీతకచేరి చేయటం లేదని తెలుసుకున్న తరువాత, పాత కేడీ గాండేమో అన్నట్టు చూసాడు పోలీసు. అదీ అవునో కాదో ఇదమిత్థంగా తేలక ముందే పిచ్చాడు కాదు గదా అన్నట్టు చూసాడు పోలీసు మళ్లా.




అంతే-

అహోబలరావు ఏడుపు ఆలాపన దగ్గరే ఆగిపోయింది.

ఈ లోగా పోలీసు అహోబలరావు ఎవరో తేల్చుకోలేక, ఆపని తన పైఅధికార్లకి అప్పగించే ప్రయత్నంలోన అహోబలరావుని "పద పోలీస్ స్టేషన్‌కి" అని లాఠీ ఝళిపిస్తూ హెచ్చరించాడు.

నగరంలో ఇటీవల సంచలనం సృష్టించిన "పోలీసోళ్ళ పేణాలు తోడేత్తన్న" చోరీ కేసుతో ఈ అహోబలరావుకి సంబంధం ఉందని ఇంటరాగేషన్‌లో ఎలాగోలా రుజువుచేసి........ అమట్న........??

పోలీసాయనకి హుషారొచ్చి లాఠీతో అహోబలం భుజబలాన్ని పరీక్షించడానికి ఉద్యుక్తుడయ్యాడు........

"ఏం చేస్తున్నావిక్కడ"—పోలీసు గర్జన.

"ఏడుస్తున్నాను" - అహోబలరావు సమాధానం.

"ఎందుకేడుస్తున్నావ్"

"అర్థం లేని ప్రశ్న. నవ్వడానికి కారణాలు తక్కువ. ఏడవడానికి అనేకం. అసలు ఏడుపే ఇప్పుడున్న పరిస్థితులకు కటాకట్‌న సరిపోతుంది. నవ్వు ఈ పరిస్థితుల్లో రాకూడనిది"

"ఐతే స్టేషన్‌కి పద-అక్కడ ఇంకా బాగా ఏడిపిస్తాం..."-తిరిగి పోలీసు గర్జన.

ఇక వాయిదా వేసుకో దలచలేదు అహోబలరావు.

విషాదంవల్ల కలిగే ఏడుపుకన్న, ఏడుపు వాయిదా వేసుకోవడం వల్ల కలిగే విషాదమే ఎక్కువ అని అర్థమై పోయిం అహోబలానికి

అందుకే-

అక్కడికక్కడ-

అప్పటికప్పుడు-

ఘొల్లున ఏడవబోయి-

ఠక్కున నవ్వేసాడు—ఏడవడానికి కూడా ఈ లోకం సౌకర్యంగా లేనందుకు దిగ్గరగా, మనసారా......!! ✱